నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | నవంబర్ 19, 2024 | www.navatelangana.com

ప్రాణం తీసిన గాలిపటం



మతిన్ (ఫైల్)

నవతెలంగాణ-ఎడపల్లి

గాలిపటం ఓ బాలుడి ప్రాణం తీసింది. ఈ విషాద ఘటన మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్నాపల్లి గ్రామానికి చెందిన మతిన్ (13) కాలనీలో గాలిపటం ఎగురవేస్తుండగా చెట్టు కొమ్మల్లో చిక్కుకుంది. గాలిపటాన్ని ఇనుప రాడుతో తీసే క్రమంలో కరెంట్ తీగలకు తగలడంతో బాలుడికి కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మతిన్ ఇదే గ్రామంలో 6వ తరగతి చదువుతున్నాడు. మతిన్ మృతితో కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. అందరితో కలుపుగోలుగా ఉండే బాలుడు ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందడంతో గ్రామంలో విషాధచాయలు అలముకున్నాయి.

చిన్నారులపై వీధి కుక్క దాడి



కుక్కల దాడిలో గాయాలైన చిన్నారులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై దొరికిన వారిని దొరికినట్లు కరుస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. గుంపులు గుంపులుగా వీధుల్లో సంచరిస్తూ ప్రజలపై పంజా విసురుతూ ప్రజల మీదకు ఎగబడుతున్నాయి. సోమవారం మండల కేంద్రంలో ఇంటి బయట ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని నడిమి గల్లీలో ఆడుకుంటున్న ముస్కన్ (9), ఆదిత్య(4)పై విధి కుక్క దాడి చేసి గాయ పరిచింది. కుటుంబ సభ్యులు గమనించి గాయ పడ్డ చిన్నారులను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. వీధి కుక్కల బెడద నుంచి రక్షించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

సమ్మె దిశగా సమగ్ర శిక్ష ఉద్యోగులు

- చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు
- సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్
- హైదరాబాద్‌లో ఎస్ఎస్ఏ ఉద్యోగుల మహాధర్నా సక్సెస్
- డిసెంబర్ 9 నుంచి సమ్మెకు రాష్ట్ర కమిటీ తీర్మానం



దీక్షలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు (ఫైల్)

నవతెలంగాణ-బోధన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శనివారం 16వ తేదీన సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. సంవత్సరాల తరబడి చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న తమను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో మహాధర్నా చేపట్టారు. ఎస్ఎస్ఏలో సీఆర్పీలు, పీటీఐలు, మెసేంజర్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్పీలు, కేజీబీవీ విభాగం వారు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క విభాగం వారికి ఒక్కోక్క రకంగా ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తుంది. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు కనీస వేతనచట్టం ప్రకారం మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

విద్యాశాఖలో ఎస్ఎస్ఏ ఉద్యోగులదే ముఖ్యపాత్ర..

విద్యాశాఖలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, విద్యాశాఖలో భాగమైన తమను క్రమబద్ధీకరించి, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 15 ఏండ్లుగా విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్నామని, సుప్రీకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు దేశంలో 28 రాష్ట్రాలలో వెస్ట్ బెంగాల్, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్, హర్యానా, మేఘాలయ, హిమాచల్ ప్రదేశ్, కేరళ, తమిళనాడు వంటి 8 రాష్ట్రాలలో మినిమం టైం స్కేల్ ఇస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగంగా సీఆర్పీలను జమ్ము కాశ్మీర్, హర్యానాలో, సీఆర్పీలను ఒరిస్సా, హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్రలో, ఐఆర్పిలను హర్యానా, కేరళలో రెగ్యులర్ చేయగా కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో మన రాష్ట్రం కంటే ఎక్కువ వేతనాలు ఇస్తున్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో పాటు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ ఇప్పటికే పంజాబ్, మేఘాలయ, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలో రెగ్యులర్ చేశారు. ఢిల్లీలో రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇన్ని రాష్ట్రాలలో వారి సర్వీస్ క్రమబద్ధీకరణ సాధ్యమైనప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నిస్తున్నారు. కేంద్రం వాట, రాష్ట్రం వాట అనడం తప్పించుకునే ప్రయత్నమే తప్పా మరేమీ కాదంటున్నారు నిపుణులు. మాడల్ స్కూల్ విషయంలో రాష్ట్రప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకున్నట్లు, సమగ్ర శిక్ష ఉద్యోగ, ఉపాధ్యాయుల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కోరుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగ, ఉపాధ్యాయులు చేసే పని కాంట్రాక్టు ఉద్యోగ, ఉపా ధ్యాయులు చేసే పని ఒక్కటే అయినప్పటికీ కనీస వేతనాలు ఇవ్వకపోవడం వెట్టిచాకిరి కాదా..? అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్లు..

మెసేంజర్, డీపీఓ స్టాఫ్, కేజీబీవీ, యూఆర్ఎస్ స్టాఫ్, సీఆర్పీలు, పీటీఐలు, ఎంఎస్ కోఆర్డినేటర్లు, సీసీఓలు, ఐఈఆర్పీలను క్రమబద్ధీకరించే వరకు కనీస వేతన స్కేలును అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 10 లక్షలు, ఆరోగ్య బీమా 5 లక్షల సౌకర్యం కల్పించాలని, భారత సర్వోన్నత న్యాయస్థానం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఇచ్చిన తీర్పుమేరకు 2018 పిఆర్సి కమిటీ తన నివేదికలో ప్రతి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి కనీస వేతన స్కేలు (కాంట్రాక్టు ఉద్యోగి హోదాను బట్టి ప్రభుత్వ ఉద్యోగికి చెల్లించే మూలవేతనం) అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు, 2018 పి.ఆర్.సి. కమిటీ సిఫారసుల మేరకు సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగికి కనీస వేతన స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపట్టారు. ఈ మహాధర్నాకు ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

డిసెంబర్‌లో సమ్మె దిశగా..

డిసెంబర్‌లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నందున, డిసెంబర్ 9వ తేదీ నుంచే సమ్మె చేపట్టడానికి సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం తీర్మానం చేసినట్లు జిల్లా జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ తెలిపారు. గతంలో సెప్టెంబర్‌లో సమ్మె చేసినప్పుడు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలలో హామీ ఇచ్చారని కానీ సంవత్సరం గడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేయలేదని, హామీ అమలుచేసే వరకు సమ్మె చేపడతామని పేర్కొన్నారు.

మినిమం టైంస్కేల్ అమలు చేయాలి



ఎస్ఎస్ఏ ఉద్యోగులుగా పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి ప్రభుత్వం తక్షణమే మినిమం టైం స్కేల్ వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సంవత్సరాల తరబడి చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న తమను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. అన్ని శాఖల మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇస్తున్నా.. పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారని ఇది సమంజసం కాదన్నారు. అందుకే తమ డిమాండ్ల సాధన కోసం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టామని అన్నారు. డిసెంబర్‌లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మెకు వెళున్నామని పేర్కొన్నారు.

- దండు విజయ్, జిల్లా జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్

మేయర్ భర్తపై దాడి

- తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలించిన స్థానికులు
- మా భూమిని కబ్జా చేశాడు.. అందుకే కొట్టాను..
- దాడి చేసిన వ్యక్తి సెల్ఫీ వీడియో వైరల్



చికిత్స పొందుతున్న మేయర్ భర్త శేఖర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో మేయర్ దండు నీతూ కిరణ్ భర్త బీఆర్ఎస్ నాయకులు దండు చంద్రశేఖర్‌పై దాడి జరిగింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం నాగారం 80 క్వార్టర్స్‌లో చోటుచేసుకుంది. నగరంలోని 10వ డివిజన్‌లో ఓ వాటర్ ప్లాంట్ వద్ద 80 క్వార్టర్స్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ రసూల్ ఆలియాస్ శక్రూ అనే యువకుడు శేఖర్‌పై దాడి చేశాడు. అంతకు ముందు సంబంధిత దాడి వీడియోను తీసేందుకు వ్యక్తిని ముందుగానే సిద్ధం చేసుకుని దాడి చేయడం దారుణం. శేఖర్‌పై ముందుగా చేతితో దాడి చేసి ఆటోలో ఉన్న రాడ్ తీసుకువచ్చి తలపై బాదాడు. ఈ ఘటనలో శేఖర్‌కు తీవ్ర రక్తస్రావం జరిగింది. అతన్ని హుటాహుటిన ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ నాయకుడు దండు శేఖర్‌పై జరిగిన దాడి గురించి నిజామాబాద్ నార్త్ సిఐకి వివరణ కోరగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. మేయర్ భర్త శేఖర్‌పై జరిగిన దాడి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. స్థానికంగా వంద గజాల ప్లాట్ వివాదంలో ఈ దాడి జరిగినట్లు తెలిసింది. అయితే కొద్ది సేపట్లోనే సెల్ఫీ వీడియో బయటకు వచ్చింది. సెల్ఫీ వీడియోలో పూర్తి వివరాలను దాడి చేసిన వ్యక్తి వెల్లడించాడు. గోపాల్ అనే వ్యక్తితో మేయర్ భర్త శేఖర్ గ్యాంగ్ మెయింటెన్ చేస్తున్నాడని, భూములను కబ్జా చేస్తున్నారని అందులో తనది కూడా కబ్జా చేశారని పేర్కొన్నాడు. భూమి కావాలంటే రెండు లక్షల రూపాయలు కావాలని శేఖర్ అడిగాడని అందువలన తాను కట్టలేని స్థితిలో, ఇవ్వలేని పరిస్థితులలో కొట్టాల్సిన పరిస్థితి వచ్చిందని వీడియోలో పేర్కొన్నాడు. భూమి ఇవ్వకుండా తనను ఇబ్బంది పెడుతున్నాడని, దానివలన తనపై దాడులు చేస్తారనే ఉద్దేశంతోనే తాను దాడి చేసినట్టు తెలిపాడు. గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ కాంగ్రెస్ అన్ని ర్యాలీలో పాల్గొన్నానని కాంగ్రెస్ పార్టీ నాయకులు తనకు అండగా ఉండాలని సెల్ఫీ వీడియోలో తెలియజేశాడు.

ఇదిలా ఉండగా దాడి ఘటన తెలుసుకున్న నిజామాబాద్ ఏసిపి, తన సిబ్బందితో మేయర్ భర్త చికిత్స పొందుతున్న ఆస్పత్రికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ.. 'కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. పరారీలో ఉన్న నిందితున్ని పట్టుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశాం.' అని తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

డబుల్ బెడ్ రూం ఇండ్లు రిపేర్ చేసి నిరుపేదలకు అందించాలి


- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రిపేర్ చేసి నిరుపేదలకు ఇవ్వాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నగర కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. నగరంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రిపేర్ చేసి నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. దాదాపు నగరంలో 1600 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఉన్నాయని, వాటిని రిపేర్ చేసి నిరుపేదలకు అందించాలని కోరారు. ఇండ్లు నిర్మించి వదిలేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ప్రజాధనం వృధా అయింది తప్పా ప్రజలకు ఉపయోగపడలేదని అన్నారు. కనీసం ప్రస్తుతమున్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా వాటిపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చాలన్నారు. అలాగే ఇంటి స్థలం లేని వారికి ప్రభుత్వ స్థలం ఎక్కడెక్కడ ఉన్నదో అక్కడ సర్వే చేసి నిరుపేదలకు స్థలాలు పంపిణీ చేయాలని ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారికి ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర కమిటీ నాయకులు అనిత, దీపిక, స్థానికులు వనజ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన నిజామాబాద్ కలెక్టర్



నిజామాబాద్ సిటీ: పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్/కామారెడ్డి

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది పరిశీలించి పలు సూచనలు చేశారు. కాగా, కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ సాఫీగా పరీక్షలు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సోమవారం జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 19,941 మంది అభ్యర్థులకు గాను, 9,880 మంది హాజరు కాగా, 10,058 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. సగటున 49.54 శాతం హాజరు నమోదయ్యిందని అన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు పోలీస్ కమిషనర్లు..

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గ్రూప్ 3 పరీక్షల నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కాగా నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సి.హెచ్.సింధూశర్మ, ఐ.పి.యస్. ఆదేశాల మేరకు అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) కోటేశ్వర రావు, అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డి, అదనపు పోలీస్ కమిషనర్ (ఎ.ఆర్) శంకర్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అక్కడ విధులలో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. 66 పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా ఈ పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేస్తూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎ.సి.పిలు, సి.ఐలు, ఎస్ఐలు సిబ్బంది విధినిర్వాహణలో ఉన్నారు.

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం మధ్యాహ్నం, సోమవారం ఉదయం జరిగిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం జరిగిన పరీక్షకు మొత్తం 8268 మంది అభ్యర్థులకు గాను 4612 మంది హాజరు కాగా, 3656 మంది గైర్హాజరయ్యారు. ఉదయం పూటకు 55.78 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.



కంఠేశ్వర్: పరీక్ష పత్రాలను భద్రపరుస్తున్న అధికారులు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్



అర్జీలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై సమర్పించిన అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణిలో (66) అర్జీలు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఈఓ చందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'గులియన్ భారీ సిండ్రోమ్' వ్యాధితో బాధపడుతున్న బాలుడు

- రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స
- ఇప్పటికే ఉన్న ఆస్తి అమ్మి వైద్యం చేయించిన తల్లిదండ్రులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



చికిత్స పొందుతున్న శ్రేయాన్

నవతెలంగాణ-గాంధారి

'గులియన్ భారీ సింద్రోమ్' అనే వ్యాధితో ఓ బాలుడు బాధపడుతున్నాడు. బాలుడి చికిత్స కోసం తల్లిదండ్రులు ఇప్పటికే చాలా ఖర్చుచేశారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. మండల కేంద్రానికి చెందిన బెజుగం శ్రేయాన్ (11) గత మూడు నెలలుగా ప్రపంచంలోనే అరుదైన వ్యాధితో బాధపడుతూ రెయిన్‌బో హాస్పిటల్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. గత మూడు నెలలుగా ఈ వ్యాధితో బాధపడుతున్న బాలుడికి తల్లిదండ్రులు ఉన్న ఆస్తి అమ్మి చికిత్స చేయిస్తున్నారు. ఇంకా చికిత్స చేయించే స్తోమత లేకపోవడంతో ఆపన్నహస్తంకోసం ఎదురుచూస్తున్నారు. దాతలు ఎవరైనా ముందుకొచ్చి చికిత్స కోసం ఆర్థికసాయం చేయాలని, అలాగే ప్రభుత్వం సైతం ఆదుకోవాలని బాలుడి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు - 2024 కార్యక్రమాన్ని మంగళవారం (19-11-2024) స్థానిక కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచార కార్యక్రమాలలో భాగంగా రేపు (తేదీ 19-11-2024) స్థానిక కళాభారతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి హైదరాబాద్ నుంచి వస్తున్న అంతడుపుల నాగరాజు బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.



నియామకపత్రాన్ని అందజేస్తున్న సబ్ కలెక్టర్

రేషన్ డీలర్లకు నియామకపత్రాలు అందజేసిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ డివిజన్ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీకి నిర్వహించిన అర్హత పరీక్షలో అర్హత సాధించిన వారికి సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో నియామకపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ డివిజన్లో మొత్తం 18 ఖాళీలకు 16 మందిని అర్హత పరీక్ష ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. మిగిలిన రెండు చోట్ల రిజర్వేషన్ క్యాటగిరీలో భాగంగా ఎలాంటి దరఖాస్తు రాకపోవడంతో వాటిని అలాగే వదిలేసినట్లు తెలిపారు. త్వరలో వాటిని కూడా భర్తీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. నియామక పత్రాలు అందుకున్న రేషన్ డీలర్లు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమయపాలన పాటించాలని, సరుకులను సక్రమంగా అందించాలని సూచించారు.



బోల్తా పడ్డ ధాన్యం లారీ

ధాన్యం లారీ బోల్తా

- మహిళకు తీవ్రగాయాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పెద్దవాగు సమీపంలోని మూలమలుపు వద్ద ధాన్యం లారీ బోల్తాపడడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బలాపూర్ గ్రామానికి చెందిన మౌనిక కుమార్తెతో కలిసి సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో రోడ్డు పక్కకు నిలబడ్డారు. లింగంపేట్ నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న ధాన్యం లారీ అదుపుతప్పి పెద్దవాగు సమీపంలోని మూలమలుపు వద్ద బోల్తా పడింది. అక్కడే ఉన్న తల్లీకూతుళ్లపై ధాన్యం బస్తాలు పడ్డాయి. దీంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చిన్నారిని బయటకు తీశారు. చిన్నారి సురక్షితంగా బయట పడగా మహిళకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
మంగళవారం | నవంబర్ 19, 2024 | www.navatelangana.com

డాక్టర్ భీంసింగ్ మృతి పట్ల ప్రముఖుల సంతాపం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో సీనియర్ కంటి వైద్య నిపుణులుగా పేరుగాంచిన డాక్టర్ భీంసింగ్ కన్నుమూసారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో భాదపడుతున్న డాక్టర్ భీంసింగ్ (61) హైద్రాబాద్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటుతో మరణించారు. అయన గతంలో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీ జీ ఎచ్) సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఆప్తాలమిక్ వైద్యుడిగా నిజామాబాద్ ప్రజలకు సేవలందించి గత మే నెలలో పదవీ విరమణ చేశారు. ఆయన అంత్యక్రియలు సొమవారం స్వగ్రామం మాక్లూర్ తండాలో నిర్వహించారు. ఆయన మృతి పట్ల పలువురు వైద్యులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

అంగరంగ వైభవంగా ఖానాపూర్ శివాలయం జాతర

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఖానాపూర్ గ్రామంలో శివాలయం జాతర మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి జాతర మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్, వీడీసీ నాయకులు మల్కాన, చాగంటి నడిపి గంగారం, అల్లం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానించిన పలువురు

కరెంటు షాక్‌తో యువకుడు మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



అయాన్ (ఫైల్)

నిజామాబాద్ నగరంలో కరెంట్ షాక్ తో యువకుడు మృతి చెందిన ఘట న అదివారం అర్ధరాత్రి జరిగింది. నగరంలోని ధర్మపురి హిల్స్ ప్రాంతంలో ఒక బంధువుల ఇంట జరుగుతున్న ఫంక్షన్‌కు బోధన్‌కు చెందిన అయాన్ (22) హాజరయ్యాడు. రాత్రి వేళ పంక్షన్‌కు సంబంధించిన ఒక కూలర్ అమరుస్తుం డగా విద్యుత్ షాక్ కొట్టింది. ఈ ఘటనలో అయాన్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధిత కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



యాకుబ్ ఖాన్ (ఫైల్)

దాడిలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతు మృతి చెందాడు. ఈ సంఘటన సొమవారం వెలుగులోకి వచ్చింది. నగరంలోని మహ్మదియా కాలనీకి చెందిన యాకుబ్ ఖాన్ (42) పై రెండు రోజుల క్రితం అసద్ బాబా నగర్‌లో మద్యం మత్తులో జరిగిన ఘర్షణ లో దాడి జరిగింది. అసద్ బాబా నగర్‌కు చెందిన ఇజాజ్, ఇలియాస్ దాడి చేశారు. ఈ ఘటనలో యాకుబ్ ఖాన్ మెడలో నరాలు చిట్లి అపస్మారక స్థితిలో వెళ్లాడు. ఆయన్ను కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు సొమవారం ఉదయం మృతి చెందాడు. యాకుబ్ సొదరుడు అయూబ్ ఖాన్ ఆరవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినిని మంత్రగాడి వద్దకు తీసుకెళ్లిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేజీబీవీ మాక్లూరులో బంగారు గొలుసు పోయిందని విద్యార్థిని మంత్రగాడి దగ్గరికి తీసుకెళ్లిన వారిపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యు ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. కేజీబీవీ మాక్లూరులో 6వ తరగతి విద్యార్థినిని మంత్రగాడికి దగ్గరికి తీసుకెళ్లిన ఘటనలో ప్రధాన బాధ్యులైన సోషల్ సీఆర్టీ గౌతమి రెడ్డి పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో విచారణ జరిగినా ఇప్పటికీ కనీస చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఘటనకు సంబంధంలేని అమాయకులైన ముగ్గురిని బదిలీ చేయడం అన్యాయమని అన్నారు. తక్షణమే సీఆర్టీ గౌతమిరెడ్డి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు అషుర్, నాయకులు సృజన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలి

- పిడిఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని పిడిఎస్‌యూ తెలంగాణ యూనివర్సిటీ నాయకుడు రవీందర్ డిమాండ్ చేశారు . సోమవారం తెలంగాణ యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో తెలంగాణ యూనివర్సిటీలో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయని, పేద విద్యార్థులు యూనివర్సిటీ విద్యకు దూరమవుతున్నారని అన్నారు. బయట పీజీ కళాశాలలకు స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా ఖాళీలను భర్తీ చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నారని, కానీ యూనివర్సిటీలో కొన్ని సంవత్సరాలుగా ఖాళీ సీట్లను భర్తీ చేయడం లేదని విమర్శించారు. ఈసారైనా ఖాళీగా ఉన్న ఇంటిగ్రేటెడ్ కోర్సులు, పీజీ, ఎల్ఎల్‌బి, బిఎడ్ సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేసి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు న్యాయం చేయాలని అయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పి.డి.ఎస్.యూ యూనివర్సిటీ నాయకులు హనుమండ్లు, రాకేష్, వెంకన్న, కార్తీక్, రవీంద్రనాథ్, ప్రభాస్, తరుణ్ గౌతమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

19న బాలురు, బాలికల హాకీ ఎంపికలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 20 న ఉదయం 9 గంటలకు నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల ఎస్జీఎఫ్ఐ 19 సంవత్సరాల బాలురు, బాలికల హాకీ ఎంపికలు మినీ స్టేడియం ఆర్మూర్ నందు నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు 2006 జనవరి 01 తర్వాత జన్మించి ఉండవలెనని, ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న క్రీడాకారులు మాత్రమే దీనికి అర్హులని, ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనేటువంటి క్రీడాకారులు సరైన ధ్రువీకరణ పత్రాలతో ఎంపికలకు హాజరుకావాలని తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ బకాయిలను విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్



ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్‌కి సంబంధించిన రూ.175కోట్ల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శులు రాచకొండ విగ్నేష్, కొండ గంగాధర్ తెలిపారు. సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దళిత పిల్లలు 19వేల మంది, గిరిజన పిల్లలు 6 వేలమంది చదువుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా రూ.175 కోట్లు చెల్లించకుండా దళిత గిరిజన విద్యార్థుల చదువులకు కోత పడే అవకాశం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 8నెలలు చెల్లించలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఈ బిల్లులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థుల తమ చదువులు నష్టపోతున్నారన్నారు. నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన సుమారు రూ.10 కోట్ల బకాయిలను ఎస్సీ సంక్షేమ శాఖ విడుదల చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, జిల్లా నాయకులు దినేశ్, చక్రీ, తదితరులు పాల్గొన్నారు.

సంఘాల్లో లేని వారిని సంఘంలో చేర్పించాలి

- ఎపిఎంలు సువర్ణ, కుంట గంగారెడ్డి
- ఇందిరా మహిళా శక్తి సంబరాలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి/కమ్మర్‌పల్లి

మహిళా సంఘంలో లేనివారిని సంఘాల్లో చేర్పించే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని, ఈనెల 14 నుండి డిసెంబర్ 9 వరకు జరిగే ఇందిరా శక్తి మహోత్సవాలు విజయవంతం చేయాలని ఏపీఎం సువర్ణ పేర్కొన్నారు. సోమవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో ప్రత్యేక మండల సమైక్య సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుండి సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎం సూవర్ణ మాట్లాడుతూ సంఘంలో లేని మహిళలను సంఘంలో చేర్పించాలని, ప్రతి గ్రామంలో ఉన్న వికలాంగులను గుర్తించి వారిని సంఘాలుగా చేయాలని, మహిళ లకు ప్రమాద భీమా కింద 10 లక్షల ఇన్స్యూరెన్స్, లోన్ భీమా, సురక్ష భీమా, మహిళ శక్తి క్యాంటీన్ ఏర్పాటు, మహిళకు సోలార్, నాటు కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తిలో తయారు చేసే వస్తువులు, పాడి గేదెలు, పిండి గిర్ని, ఎంటర్ ప్రైజెస్, బ్యాంక్ లింకేజ్, స్త్రీ నిధి రుణాలు, వడ్డీ లేని రుణాలు అందజేసే విధంగా మహిళ సంఘాల సభ్యులకు ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, యూనిఫాం ల తయారీ డ్వాక్రా బజార్ ఏర్పాటు, మండల మహిళా సమాఖ్య భవనాలు, జిల్లా సమైక్య భవనాల నిర్మాణం, మహిళా క్యాంటీన్ ఏర్పాటు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ కార్యక్రమంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశం మండల సమైక్య అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశంలో సీసీల ఉదయ్, అనురాధ, గోవింద్, గ్రామాల మహిళా సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి: మాట్లాడుతున్న ఏపీఎం, ఐకెపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుంట గంగాధర్

కమ్మర్‌పల్లి : ఇందిరా మహిళా శక్తి సంబరాలను విజయవంతంగా నిర్వహించాలని మండల ఏపీఎం, ఐకెపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుంట గంగాధర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల సమైక్య కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునుపెన్నడు లేని విధంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రతి ఒక్క డ్వాక్రా మహిళకు రెండు లక్షల వరకు పూర్తి ఉచితంగా లోన్, బీమా సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నూతనంగా వ్యాపారాలు ఏర్పాటు చేసే వారికి గతంలో రెండు లక్షల వరకు మాత్రమే రుణాలు ఇచ్చే వారమని, ప్రస్తుతం ఈ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల వరకు పెంచిందన్నారు. ఎప్పటికప్పుడు వడ్డీ లేని రుణాల రాయితీ డబ్బులు మహిళా సంఘాల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు.

తాజాగా ఫిబ్రవరి, మార్చ్ 2024 సంవత్సరానికి సంబంధించిన 2 నెలల వడ్డీ రాయితీ డబ్బులను నేరుగా మహిళా సంఘాల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి జరుగుతుందని, అలాగే పిల్లల యూనిఫామ్‌లు మహిళల ద్వారా కుట్టించే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలను మహిళా సంఘాల ద్వారా అమలు చేయబోతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో 18 సంవత్సరాలు నిండి అర్హత ఉన్న ప్రతి ఒక్క పేద మధ్యతరగతి మహిళలను మహిళా సంఘాల్లో సభ్యురాలిగా చేర్పించాలని సిబ్బందికి సూచించారు. ఇందుకోసం సీసీలు, వివోఏలు, గ్రామ సమాఖ్య అధ్యక్షురాల్లు, పాలకవర్గ సభ్యులు డిసెంబర్ 9 వరకు కృషి చేయాలని కోరారు. డిసెంబర్ 9 వరకు రూ.15 కోట్ల రుణాలను సైతం అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ మేరకు రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సమాఖ్య సమావేశాలు నిర్వహించాలని, దీనికి అనుబంధంగా అన్ని స్వయం సహాయక సంఘాల సమావేశాలు కూడా నిర్వహించి ఇందిరా మహిళా శక్తి సంబరాల యొక్క ఉద్దేశాన్ని మినిట్స్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రోజారాణి, కార్యదర్శి వాసవి, సిసిలు రవికుమార్, భాగ్యలక్ష్మి అలేఖ్య, అకౌంటెంట్ ధనలక్ష్మి మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ మంజూరుపట్ల హర్షం

- ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని సన్మానించిన చింతల కిషన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి 33/11 కెవి సబ్-స్టేషన్ నిర్మాణం మంజూరు చేయడంపట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిటిసి చింతల కిషన్ హర్షం వ్యక్తం చేస్తూ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి సోమవారం బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి చింతల కిషన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ప్రత్యేక చొరవతో ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో లో 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణం కోసం రూ 248.43 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. దానిలో భాగంగానే కొన్ని రోజులు క్రితం ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు తహసిల్దార్ వెంకట్రావు, మండల రెవెన్యూ అధికారి మోహన్, సర్వేయర్, టీజీ ఎన్పీడీసీఎల్ ఏఈ పండరినాథ్, గ్రామంలోని గురుకుల పాఠశాల సమీపంలో రెండు ఎకరాలు భూమిని పరిశీలించి నివేదికను అందజేయడంతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంజూరు లభించిందని చింతల కిషన్ తెలిపారు. తిర్మన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధి మొత్తానికి ప్రస్తుతం డిచ్ పల్లి మండలంలోని రాంపూర్ (డి), గన్నారం సబ్ స్టేషన్ల నుండి విద్యుత్ సరఫరా అవుతుందని, వీటి పరిధిలో ఏ చిన్న సాంకేతిక ఇబ్బందులు తలెత్తిన విద్యుత్ కు అంతరాయం ఏర్పడి ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణం గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే ప్రత్యేక కృషి తోనే సాధ్యమైందని గతంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించిన సబ్ స్టేషన్ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఈ సారి ఎన్నికల సమయంలో గ్రామస్తులకు సబ్ స్టేషన్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని, ఈ మేరకు సబ్ స్టేషన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతో గ్రామస్తులు, రైతులు, వ్యాపారస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో ఐడిసిఎంఎస్ చైర్మన్ తారా చంద్ నాయక్, డైరెక్టర్ బొక్క గంగాధర్, నర్సగౌడ్, శంకర్ గౌడ్, అహ్మద్ హుస్సేన్, శ్రీనివాస్ గౌడ్, నాందేడ్ శంకర్, కుమ్మరి గంగారాం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానించిన పలువురు

అన్ని రకాల పింఛన్లు పెంచాలి

- పెన్షన్లదారుల ద్రోహి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వీహెచ్‌పీఎస్ రిలే నిరాహారదీక్షలు
- 26న నాడు చలో హైదరాబాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వృద్ధులు వితంతుల ఒంటరి మహిళా పెన్షన్లు 4000 రూపాయలు పెంచాలని, వికలాంగులకు పెన్షన్లు 6000 రూపాయలు పెంచాలని, హామీ ఇచ్చి తుంగలో తొక్కిన మొదటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని వీహెచ్పీఎస్ జిల్లా కమిటీ నాయకులు అన్నారు. సోమవారం విహెచ్పిఎస్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ రిలే నిరాహార దీక్షలు ఈ నెల 23 వరకు జరుగుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనే స్వయంగా ఎన్నికల సమయంలో అన్ని సామాజిక పెన్షన్లు 2000 నుంచి 4000, వికలాంగుల పెన్షన్లు 4000 నుంచి 6000 పెంచుతామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడిచి పోయిన హామీలు అమలు చెయ్యకుండా కనీసం మానవత్వం లేని ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. నిరాహారదీక్షల సమయంలో పెన్షన్ల పెంపు ప్రకటన రాకపోతే ఈ నెల 26న పెన్షన్ దారుల ఆవేదన సభ హైదరాబాద్ కేంద్రంగా మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహిస్తామన్నారు. ఈ దీక్షలను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, ఎంఎస్‌పి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సారికెళ్ల పొషెట్టి మాదిగ ప్రారంభించారు. ఈ దీక్షకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, ఎంఎంఎస్, ఎంఈఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ దీక్షలో విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు బీరప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు సలీం, మహిళా విభాగం చిట్టి కృష్ణవేణి, గంధాల గంగాధర్ పంతులు, రాథోడ్ తిరుమల్ నాయక్, అరె రాజు, రమేష్, గంగాధర్ గౌడ్, భూమయ్య, పర్వీన్ బేగం, అలివేణి, సబేర, ఎంఈ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మారుతి, ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద ప్రభాకర్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు సత్తెక్క, యమున, ఎంఎంఎస్ రాష్ట్ర నాయకులు సావిత్రి, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు పద్మ, సుధ, తదితరులు పాల్గొన్నారు.



నిరాహారదీక్షలో మాట్లాడుతున్న వీహెచ్పీఎస్ జిల్లా కమిటీ నాయకులు

నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జిల్లా లంబాడి హక్కు పోరాట సమితి నాయకులను జక్రాన్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారని లంబాడి హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు చౌహాన్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గ గిరిజన లంబాడీల భూములను ఫార్మ కంపెనీల పేరుతో నిర్బంధంగా గుంజుకోడాన్ని లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చలో కోడంగల్ పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చౌహాన్ మోహన్ నాయక్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి చిన్య నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్ నాయక్, రాష్ట కార్యదర్శి రవీందర్, అలాగే విద్యార్థి సంఘం నాయకులు జేత్రం నాయక్‌ని ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో లంబాడీలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అరెస్ట్ చేసిన లంబాడి రైతులను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.



ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

సిద్దుల గుట్టపై రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఆర్మూర్

కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని సోమవారం తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి లోని పట్టణంలోని నవనాథ సిద్దేశ్వరాలయ పరమశివున్ని దర్శించుకుని కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా సిద్దలగుట్ట ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

బోనస్ డబ్బులు ఎప్పుడు?

- మాజీ జెడ్పిటిసి కమల నరేష్

నవతెలంగాణ-మోపాల్

బోనస్ డబ్బులు ఎప్పుడు ఇస్తారని మాజీ జెడ్పిటిసి కమల నరేష్ ప్రశ్నించారు.

మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ డబ్బులు ఇస్తానని ఇప్పటివరకు చెల్లించలేదని, కేవలం ప్రభుత్వ గిట్టుబాటు ధర మాత్రమే రైతుల ఎకౌంట్లకి వస్తున్నాయని తెలిపారు. ప్రతి విషయంలో రైతులను మోసం చేస్తుందని, రణమాఫీ అని చెప్పి ఇప్పటివరకు మొత్తం రైతులకి చేయలేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 11 నెలలు గడుస్తున్నా కూడా ఇప్పటికి రేషన్ కార్డుల జారీ లేదని ఇలా ప్రతి విషయంలో అబద్ధాలు చెప్తూనే ఉందని విమర్శించారు. కానీ అన్నం పెట్టే రైతు విషయంలో మాత్రం అబద్ధం చెప్పకుండా వారికి 500 రూపాయల బోనస్ సకాలంలో వేయాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన తెలిపారు. ఒకవేళ బోనస్ వెయ్యలేము అని ముందే చెప్తే రైతులు ప్రభుత్వం కంటే బయట మార్కెట్లోని ఎక్కువ దొరక అమ్ముకునేవారని ఆయన తెలిపారు. కనీసం ఎన్ని క్వింటాళ్లకు బోనస్ ఇస్తాం, ఎప్పుడు వేస్తామనేది తెలియకుండా రైతులకు ఆశ పెడుతూ మోసం చేస్తుందని అన్నారు. ఇప్పటికే రైతుబంధుకు ఎగనామం పెట్టిందని ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ప్రభుత్వ వ్యతిరేకత ప్రారంభమైందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలు చెబుతూనే ప్రజల మోసగిస్తుందని మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని ఆయన తెలిపారు.

బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నికయినట్టు నాయకులు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా టి.చక్రపాణి, అధ్యక్షులుగా వై.ఓమయ్య, ఉపాధ్యక్షులుగా మల్లు బాయ్, కవిత, లక్ష్మి ప్రధాన కార్యదర్శిగా ఎస్.భానుచందర్, సహాయ కార్యదర్శులుగా రేవతి, గాండ్ల రాజవ్వ, సాబేర బేగం, గంగామణి, కోశాధికారిగా డి.మహేష్, 12 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అన్నారు. అనంతరం వారు కొన్ని తీర్మానాలు చేశారు. బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, బీడీ పరిశ్రమలోల 26 రోజుల పని కల్పించాలని తెలిపారు. బీడీ కార్మికులకు, టేకేదారులకు, ప్యాకర్లకు, బట్టివాళకు 4016 రూపాయలు జీవన భృతి అందరికీ కల్పించాలని, రిటైర్ కార్మికులకు 7500 రుపాయల పెన్షన్ ఇవ్వాలని, ఈపీఎఫ్‌లో ఆర్‌ఓసి పునరుద్ధరణ చేయాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. జిల్లాలోని బీడీ కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ ఐక్యం చేసి సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు


రోదిస్తున్న బాధితుడు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని దేవపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రెడ్డి మల్లయ్య కుమారుడు శివ మృతి చెందడంతో కాంగ్రెస్ కార్యకర్తలు అంత్యక్రియల్లో పాల్గొని రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి తెలిపారు. శివ గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందించామని బాధిత కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామన్నారు. అంత్యక్రియల్లో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గైని శివాజీ, యూత్ అధ్యక్షులు అఖిల్ రావు, నాయకులు శ్రీకాంత్, జైపాల్ రెడ్డి, సతీష్, భాస్కర్, కార్యకర్తలు తదితరులున్నారు.

\సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్



మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని రెంజల్, సాటాపూర్, నీల గ్రామాలలోని 12 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గంలోని నిరుపేదలకు ఆర్థికసాయం అందేలా కృషి చేస్తున్నారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.సాయిరెడ్డి, సిహెచ్.రాములు, ధనుంజయ్, జావేద్ ఉద్దీన్, ఇందిరా దేవి, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, సాయిబాబాగౌడ్, ఎంఎల్ రాజు, బాబన్న, సగ్గు వెంకటి, సాయగౌడ్, ఆసాని అనిల్, షబ్బీర్, సల్మాన్, సమ్మి, హైమద్ చౌదరి, జక్కుల అబ్బయ్య, తాళ్ల మహేష్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు
- సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/నిజాంసాగర్

ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం మండల సహకార సంఘం ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంతకుముందు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎకరానికి 6 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేసేవారని, తాను వ్యవసాయ మంత్రితో మాట్లాడటంతో దానిని 10 క్వింటాళ్లకు పెంచారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సొసైటీ సీఈఓ సందీప్, శామప్ప, మల్లప్ప పటేల్, మోహన్, హైమద్, సంజీవు, సంతోష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నిజాంసాగర్ : మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టులో 100శాతం సబ్సిడీతో ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులోకి 24 లక్షల చేప పిల్లలను విడుదల లక్ష్యంగా సోమవారం 4 లక్షల చేప పిల్లలను విడుదల చేసినట్టు వివరించారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేప పిల్లల పెంపకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. దళారులు ఒక మాఫీయాలా ఏర్పాటై మత్స్యకారుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా ఫిష్ డెవలప్మెంట్ అధికారి శ్రీపతి, తహసీల్దార్ బిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, మండల ఫిష్ డెవలప్‌మెంట్ అధికారి డోలిసింగ్, నాయకులు, మండలాధ్యక్షులు మల్లికార్జున్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దకొడప్‌గల్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పాలనా అధికారుల నియామకం

నవతెలంగాణ-పోతంగల్


అధికారులకు సన్మానం

మండల కేంద్రంలోని సహకార సంఘం పాలక వర్గాన్ని రద్దు చేస్తూ ఉత్తరువులను జారిచేసి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌లను నియమించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-1గా ఎండి రియాజుద్దీన్, సీనియర్ ఇన్‌స్పెక్టర్, (రుద్రూర్ క్లస్టర్ ఇంచార్జ్)ను నియమించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ -2గా వెంకటేశ్వర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ (ఎన్‌డిసిసి, బ్యాంక్)ను నియమించారు. ఈ సందర్భంగా సోమవారం పోతంగల్ ఎల్ఎస్‌సిఎస్‌లో వారు బాధ్యతలు స్వీకరించారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సహకార సంఘాన్ని తమ అనుభవం జోడించి, నిబంధనల ప్రకారం నడుపుతామన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- లయన్స్ జిల్లా ఆర్గనైజర్ సూర్యనారాయణ

నవతెలంగాణ-ఎడపల్లి

కంటి వైద్య శిబిరాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ జిల్లా ఆర్గనైజర్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని జానకంపేట గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో లయన్స్ కంటి అంబులెన్స్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. జానకంపేట గ్రామానికి చెందిన 73 మందికి కంటి వైద్య నిపుణులు సతీష్ పరీక్షలు నిర్వహించారు. 13 మందికి మోతిబిందు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వారిని కంటి వైద్య పరీక్ష నిమిత్తం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో గల కంటి ఆసుపత్రికి తరలించారు. మందులు, మాత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ గంగారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి మండలాధ్యక్షులు మనోజ్ కుమార్, కదం ప్రకాష్ రావు, నాయకులు, స్థానిక గ్రామస్తులు, పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులను పూర్తి చేయాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి

గత రెండు సంవత్సరాలుగా బీటీ రోడ్డు వేయడం లేదని దానిని వెంటనే పూర్తి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ నాయక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధారి మండలం పోతంగల్ గ్రామం నుంచి మేడిపల్లి తాండ వరకు 2 కిలోమీటర్ల 700 మీటర్లు దూరం, (గాంధారి నుంచి బాన్సువాడ వెళ్లే దారి) ఈ రోడ్డు కంకర రోడ్డు ఉండడం వల్ల ప్రయాణికుల బైకులు, కార్లు అన్ని రకాల వాహనాల టైర్లు పంచర్లు అవుతున్నాయన్నారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా బీటీ రోడ్డు వేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులను మరింత ప్రోత్సహించాలి

- విద్యార్థుల తల్లిదండ్రులు

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థులు ముందుకు సాగేందుకు అధ్యాపకులు మరింత ప్రోత్సహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. సోమవారం తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా బోధన తీరు బాగుందని, ముందుకు సాగేందుకు ప్రోత్సహించాలని జిల్లాలో కళాశాల పేరు ముందుండేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులను నిత్యం కళాశాలకు వచ్చేలా కృషి చేయాలని అధ్యాపకులు సంతోష్, వీరేశం విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ సమావేశంలో అధ్యాపక బృందం, విద్యార్థులు తల్లిదండ్రులు ఉన్నారు.

డ్వాక్రా సంఘంలో చేరాలి

- ఏపీఎం జగదీష్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

గ్రామాల్లో ఐకెపి ద్వారా ఏర్పాటు చేయబడిన డ్వాక్రా సంఘాలలో చేరని సభ్యులు సంఘంలో చేరాలని ఏపీఎం జగదీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల ఐకెపీ కార్యాలయంలో గ్రామాల వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలకు రుణ బీమా సౌకర్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి పది లక్షల బీమా సౌకర్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇన్సూరెన్స్‌కు సంబంధించిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బెస్త శాంత, కోశాధికారి మానెమ్మ, అకౌంటెంట్ రాజు, ఐకెపి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ జెడ్పిటిసి కుటుంబ సభ్యులకు పరామర్శ

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని మాజీ జడ్పిటిసి తీగల తిరుమలగౌడ్ తల్లి తీగల సత్తెమ్మ గత 5 రోజుల క్రితం మరణించింది. దోమకొండ ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, చెగుంట ఎంపిడిఓ చెన్నారెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను వారి ఇంటిలో సత్తమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారిని పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశుగణనను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- మండల పశువైద్యాధికారి సంతోష్

నవతెలంగాణ-పిట్లం

పశుగణన సర్వేను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి సంతోష్ తెలిపారు. సోమవారం మండలంలోని రాంపూర్ (కలాన్) గ్రామంలో పశువుల గణనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21వ జాతీయ పశువు గణనలో భాగంగా జంతు జనాభాకనుగుణంగా అందుబాటులో ఉన్న జాతుల వివరాలను అంచనా వేయడం జనాభా ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆయా ప్రాంతాలలో లభ్యమయ్యే జాతుల రకాల పశువుల పెంపకం దారులు, చిన్న, పెద్ద జంతువులు, తెలుపు, నలుపు, ఆవులు, గేదెలు, పౌల్ట్రీ, గుర్రాలు, గాడిదలు, కుక్కలు, బాతులు జంతువుల సంఖ్య వివరాలను పశు గణన అధికార బృందానికి సమాచారం అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాలమిత్ర, రైతులు, పాల్గొన్నారు.


పశుగణన చేస్తున్న పశువైద్యాధికారులు

ఉపాధిహామీ పనులు నిబంధనల ప్రకారం చేయాలి

- ఏపీడీ వామన్‌రావు

నవతెలంగాణ-దోమకొండ

ఉపాధిహామీ పనులు నిబంధనల ప్రకారం చేయాలని ఏపీడీ వామన్‌రావు అన్నారు. మాచారెడ్డి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో 2023-24 సంవత్సరంలో రూ.9కోట్ల రూపాయలతో చేపట్టిన ఉపాధి హామీ పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీలో చేసిన కూలీలకు డబ్బులు కొంతమందికి రాలేదని తెలిపారు. గ్రామాలలో నాటిన మొక్కలలో కొన్ని మొక్కలు చనిపోయాయని, ఉపాధి హామీ పనుల మస్టారులో కూలీల సంతకాలు లేకున్నా బిల్లులు చేశారని తెలిపారు. ఉపాధి హామీలో గొర్రెల షెడ్డుల నిర్మాణం యజమానులకు షెడ్డు పైప్‌లు నాణ్యతతో లేవని సామాజిక బృందం సభ్యులు ప్రజావేదికలో చెప్పడంతో యజమానులకు రూ.1250 చొప్పున 5 గురికి రికవరీ చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపి బాబు, ఏపీవో సాయిబాబ, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి

- జిల్లా ఇంటర్ కళాశాల నోడల్ అధికారి షేక్ సలామ్

నవతెలంగాణ-దోమకొండ

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని జిల్లా ఇంటర్ కళాశాల నోడల్ అధికారి షేక్ సలామ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో ప్రతి రోజు విద్యార్థుల శాతం పెంచాలని, కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత, మంచి ర్యాంకులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి రోజు తప్పకుండా స్టడీ అవర్స్ నిర్వహించి, దాని కోసం సబ్జెక్టుల వారిగా ప్రత్యేక టైం టేబుల్ ఏర్పాటు చేశామని, వెనుక బడిన విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి

- పీవైఎల్ డిమాండ్

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ హాస్పిటల్స్‌ను బలోపేతం చేసి, ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సరస్వతీనగర్‌లో పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నవీన్ కుమార్, పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు బి.నాగమణి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులలో డాక్టర్లు, నర్సులు సరిపడా లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు సరైన వైద్య సేవలను అందడం లేదన్నారు. పేషెంట్లకు వైద్య పరీక్షల సౌకర్యం లేక బయటకు వెళ్లి ప్రైవేట్ ల్యాబులలో టెస్టులకు అధిక ఫీజులు చెల్లించుకోలేక ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లకు ఒకే రకమైన మందులను ఇస్తున్నారని, బయట ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం కోసం అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేషెంట్లను ప్రైవేటు కార్పోరేట్ హాస్పిటల్‌లకు తరలించే పిఆర్ఓ సిస్టంను అరికట్టాలని, ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్‌లపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని డిమాండ్ చేశారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్య రక్షణ, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వాల బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పవన్, పోశెట్టి, గంగారాం, ఇర్షాద్, నసీర్, యాదమ్మ, లక్ష్మీ, గంగామణి, నాగరాణి, రేణుకా, గోదావరి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

నవతెలంగాణ-సదాశివనగర్

వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అన్నారు. సోమవారం కాలోజీవాడి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు చిన్నపాటి సమస్య లేకుండా తేమ శాతం పరిశీలించి వెంటనే తూకం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన సుస్మితకు సన్మానం

నవతెలంగాణ-తాడ్వాయి



మండల కేంద్రానికి చెందిన సుస్మిత ఇటీవల వెల్లడించిన గ్రూప్-4 ఫలితాల్లో ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం సుస్మితను మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు సన్మానించారు. అతి పిన్నవయసులో ఉద్యోగం సాధించడం గొప్ప విషయమని మున్ముందు ఉన్నత ఉద్యోగాలు సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, యాదగిరి, సుధాకర్, తదితరులున్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్తల్మిక్ అధికారి టీం హరికిషన్‌రావు, ఆర్‌విఎస్‌కే డాక్టర్ మారుతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను మాజీ జెడ్పిటిసి ఉషాగౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని గుర్తించి గ్రామస్తుల సౌకర్యార్థం సిసి రోడ్డు ఏర్పాటు చేయడానికి స్థానిక శాసనసభ్యులు మదన్మోహన్ రావును సంప్రదించగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని రోడ్డు వేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ రవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సింలు, మల్కాపూర్ శ్రీను, గంగారం, శ్రీనివాస్ గౌడ్, సాయిబాబా, నరేందర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎటువంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలు గ్రామాలలో నివాసం ఉంటున్న వారు ఏవైన తమ సమస్యలను ప్రజావాణికి వచ్చి ఫిర్యాదులు అందజేయాలని తెలిపారు. మైనర్‌గా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, మా పరిధి లేకుంటే డివిజన్, జిల్లా స్థాయి అధికారులకు వివరాలు పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ రాము, పశువైద్యాధికారి పండరి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తిప్పారం గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ


శివాజీ విగ్రహారణలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని తిప్పారం గ్రామంలో ఆర్య క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆర్య క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తానాజీరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యక్షత్రియులు అందరూ ఐక్యమత్యంగా ఉండి మన జాతి ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్య క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టూ వెంకట్‌రావు, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు, ముకుంద్ రావు, ఆనంద్‌రావు, లక్ష్మన్ రావు, రాజు రావు, పాల్గొన్నారు.

మహిళా శక్తి కార్యక్రమాలను 29 వరకు పూర్తి చేయాలి

- ఏపీఎం చిన్నయ్య

నవతెలంగాణ-రెంజల్

మహిళా శక్తి కార్యక్రమాన్ని ఈనెల 29 వరకు 100శాతం పూర్తి చేయాలని ఏపీఎం చిన్నయ్య స్పష్టం చేశారు. సోమవారం ఐకెపి కార్యాలయంలో మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మీగారి లక్ష్మి అధ్యక్షతన మహిళ శక్తి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో 60 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి మహిళ గ్రూపులలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఎంటర్ప్రైజెస్, బ్యాంకు లింకేజీ, బ్యాంకు యాడ్ పౌల్ట్రీ, మిల్క్ ఎనిమల్స్, మదర్ యూనిట్స్ సంబంధించిన మహిళా శక్తి యూనిట్స్ ఈనెల 29 లోపు 100శాతం పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ వరలక్ష్మి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లసీంగారి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి మాధవి, కోశాధికారి స్వరూప, సీసీలు శ్యామల, భాస్కర్, శివకుమార్, రాజయ్య, కృష్ణ, సునీత, కంప్యూటర్ ఆపరేటర్ తస్లీమా, సిఏలు, గ్రామ సమైక్య అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎడపల్లి ట్రాన్స్‌కో ఏడీఈగా ప్రభాకర్

- ఏఈగా ఎడ్ల కిషోర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ


ఇంజనీర్లను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రంలో గల 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏడీఈగా ప్రభాకర్, ఏఈగా ఎడ్ల కిషోర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పోస్టింగులు ఖాళీ ఉండడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు అధికారులను ఎడపల్లికి బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, ఉపాధ్యక్షులు గాంధారి అనిల్ రెడ్డి, మంగళ్ పహాడ్ డైరెక్టర్ చేపూర్ నగేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు జావిద్ బాబా, మనిషారెడ్డి, చిట్టపు హన్మాండ్లు, మల్లెపూల శ్రీనివాస్, సారంగాపూర్ ట్రాన్స్‌కో ఏడిఈ తోట రాజశేఖర్, రైతులు, ఎడపల్లి ట్రాన్స్‌కో సిబ్బంది అధికారులను ఘనంగా సన్మానించారు.

గురుద్వార్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, మండల నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

గత రెండు రోజులుగా మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావుతో పాటు మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోమవారం నాందేడ్ జిల్లా కేంద్రంలో గల గురుద్వార్‌ను సందర్శించి దర్శించుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే అత్యంత సన్నిహితుడు సాయిపటేల్, సీనియర్ నాయకులు హనుమాన్ స్వామి, మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్, యూత్ నాయకులు హనుమంతు యాదవ్, మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, నాగేష్ పటేల్, సచిన్, బాలు యాదవ్, అమూల్, వట్నాల రమేష్, బాలు షిండే, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్‌లో ఉత్తమ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే..

మహారాష్ట్రలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతారావు సోమవారం కలిశారు. రాష్ట్రమంత్రికి బోకేను అందజేసి జుక్కల్ నియోజకవర్గ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల నాయకులు తదితరులున్నారు.

మహిళ కడుపులో నుంచి 5 కిలోల కణతి తొలగింపు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రిషిత హాస్పిటల్ వైద్యులు వెంకట్ గౌడ్ మహిళ కడుపునుండి 5 కిలోల కంతిని తొలగించి మహిళ ప్రాణాలు కాపాడారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన 65 సంవత్సరాల రాజవ్వ గడ్డతో తీవ్ర ఇబ్బందులు పడగా సోమవారం ఆపరేషన్ చేసి గడ్డను తొలగించారు. స్టాఫ్ నర్సులు ఆస్పత్రి సిబ్బంది సేవలకు వారి కుటుంబ సభ్యులందరూ ధన్యవాదాలు తెలిపారు.


ఆపరేషన్ చేసి తొలగించిన కణతి

రేపు వసంత జ్యోతి ఆస్పత్రిలో సంతాన సాఫల్య వైద్య శిబిరం

నోవా ఐవిఎఫ్ ఫెర్టిలిటీ వారితో..

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని వసంత జ్యోతి ఆస్పత్రిలో ఈనెల 20న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్యురాలు వసంతకుమారి సోమవారం తెలిపారు. నోవా ఐవిఎఫ్ ఫెర్టిలిటీ హాస్పిటల్ హైదరాబాద్ డాక్టర్లతో ఈశిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఆధ్వర్యంలో స్కానింగ్, అవసరాన్ని బట్టి టెస్టులు, ఓపి అన్ని ఉచితంగా చూస్తామని తెలిపారు. సంతానం కొరకు ప్రయత్నించేవారు 8105094250, 9133811133 నంబర్లకు ఫోన్ చేసి అపాయింట్మెంట్ తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదు

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



బీఆర్ఎస్, బిజెపి పార్టీలు ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు గింజ కూడా తరుగు తీయలేదన్నారు. రైతులు ఎంత తూకం వేస్తే అంతటికి డబ్బులు ఇచ్చామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం సన్న వడ్లకు 500 బోనస్ రైతుల ఖాతాలో వేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడైనా బిజెపి ప్రభుత్వం బోనస్ ఇచ్చిందా అని, రుణమాఫీ చేసిందా.. అని నాయకులను ప్రశ్నించారు?. ఆర్థిక ఇబ్బందులున్న 18 వేల కోట్ల రుణమాఫీ ప్రభుత్వం చేసిందన్నారు. మిగిలిన రుణమాఫీ కూడా చేస్తామన్నారు. పసుపు బోర్డు ఏమైందన్నారు?. బిజెపి రైతులకు ఏం చేస్తున్నారో చెప్పాలన్నారు. ప్రకటించిన పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తారో ప్రస్తావన లేదన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం సేవించి వాహనాలు నడిపిన 9 మందికి 21,500 జరిమానా విధించి ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ వీరయ్య సోమవారం తెలిపారు. ట్రాఫిక్ సిఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా మార్నింగ్ కోర్టు మెజిస్ట్రేట్ అహ్మద్ మోహిద్దీన్ 9 మందికి 21500 రూపాయల జరిమానా విధించి ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారని ట్రాఫిక్ సిఐ తెలిపారు.

పెర్కిట్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్లో ఆదివారం రాత్రి దొంగలు హల్చల్ చేశారు. తాళం వేసిన ఇల్లే టార్గెట్గా చోరీలకు పాల్పడుతున్నారు. కామారెడ్డికి ఆసుపత్రికి పనిమీద వెళ్లి వచ్చేలోగా దుండగులు చోరీకి పాల్పడ్డారని ఇంటి యజమాని తాజుద్దీన్ తెలిపారు. మహమ్మద్ తాజుద్దీన్ పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎస్టిఓగా విధులు నిర్వహిస్తున్నారు. పెర్కిట్లో నివసిస్తున్నారు. పది తులాల వరకు బంగారం, ఒక లక్ష నగదు, వెండి కూడా చోరీకి గురైందన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

మండల స్థాయి క్రీడల్లో పడగల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్ (వేల్పూర్)

మండలంలోని మోతే గ్రామంలో మండల స్థాయి క్రీడలు ఇటీవల నిర్వహించినారు. పడగల్ ప్రభుత్వ పాఠశాలకు కబడ్డీ జూనియర్ బాయ్స్ ఫస్ట్ ప్లేస్, సబ్ జూనియర్ ఫస్ట్ ప్లేస్, వాలీబాల్‌లో జూనియర్ బాయ్స్ సెకండ్ ప్లేస్, సబ్ జూనియర్ బాయ్స్ ఫస్ట్ ప్లేస్, మార్చ్ ఫాస్ట్ లో బహుమతి లభించింది. ఈసందర్భంగా విజయోత్సవ ర్యాలీని సోమవారం నిర్వహించగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ పడగల గ్రామానికి 5 షీల్డ్ లు రావడం మాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు ర్యాలీలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాక్ పట్ల గంగారెడ్డి, జక్కుల రాజేశ్వర్, మాతపు సాయన్న, మాడవేడి గంగా కిషన్, రాములు, పిఎసిఎస్ చైర్మన్ యాల్ల హనుమంత రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రామ్చందర్, పిడి రాజేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్, టై, బెల్టు, బుక్స్ అందజేత



టై, బెల్టులు అందజేస్తున్న డీఈఓ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘన్పూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు యూనిఫామ్, టై, బెల్టు, బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ క్రమ శిక్షణతో ఉండాలని, పాఠాలు బాగా విని విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళ్లాలని సూచించారు. మరో మారు పాఠశాలకు వచ్చి మ్యాథమెటిక్స్ ట్రిక్స్ చెప్తానని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు యూనిఫామ్, టై, బెల్ట్, ఐడి కార్డ్, హ్యాండ్ రైటింగ్ అందించిన వారికి జిల్లా విద్యాశాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వారన్నారు. అంతకు ముందు మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు ఆనంద్ మాట్లాడుతూ స్కూల్ యూనిఫామ్ కోసం తమ స్నేహితులు 40వేల ఇచ్చారని ఇదే కాకుండా టై, హ్యాండ్ రైటింగ్ బుక్స్ అద్యాపకులకు ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఘనపూర్ అధ్యాపకుల బృందం, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ సిటీ:మార్షల్ ఆర్ట్స్ తైక్వాండో అండం- 19 విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు. సంగారెడ్డిలో ఈనెల 16,17 తేదీల్లో 68 వ రాష్ట్ర స్థాయి తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పోటీలను నిర్వహించారని తెలిపారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి ఆధ్వర్యంలో జిల్లా నుండి విద్యార్థుల బృందం పాల్గొని మూడు బంగారు పథకాలు 3, వెండి పతకాలు 3, కాంస్య పథకాలు 3 సాధించారని తెలియజేశారు. ఈ సందర్భంగా పథకాలను సాధించిన విద్యార్థులను జిల్లా ఇంటర్ విద్యాధికారి తన కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ పోటీలలో పాల్గొనడానికి సాంకేతిక నిపుణులు ఫిజికల్ డైరెక్టర్ మాదా ఈశ్వర్, కోచ్‌లు అబ్దుల్లా ఫారుఖి, వినోద్ లు నాయకులు నాయకత్వం వహించారని తెలిపారు. బాలికల విభాగంలో రాగ పూజిత అండర్ 46 బరువు(వెట్) లో బంగారు పతకం, బాలుర విభాగంలో అండర్ 68లో మహమ్మద్ రఫీ బంగారు పతకం, బాలుర విభాగంలో అండర్ 78 వెటట్ లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి ఎంపికయ్యారని అన్నారు. బాలికల విభాగం అండర్ 42 లో బరీర అనే బాలిక వెండి పతకం, అండర్ 45 బాలుర విభాగంలో మహమ్మద్ శరీక్ వెండి పతకం, అండర్ 51 బాలుర విభాగంలో షేక్ అర్మానుద్దీన్‌లు వెండి పథకాలను సాధించారని తెలిపారు. బాలుర విభాగంలో అండర్ 63లో మహమ్మద్ ఫౌజాన్ ఖాన్, బాలికల విభాగంలో అండర్ 68 లో కాంతల స్మిత రెడ్డి, బాలుర విభాగంలో అండర్ 78 లో శివ కౌశిక్ కాంస్య పతకాలను సాధించారని జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మాధ ఈశ్వర్, కోచ్ అబ్దుల్లా ఫారుఖీ, వినోద్ నాయక్ పాల్గొన్నారు.


నిజామాబాద్‌సిటీ : అభినందిస్తున్న డీఐఈవో

ఆర్మూర్ :ఈనెల 16 నుండి 18 వరకు ఎన్టీఆర్ స్టేడియం నిర్మల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర బేస్ బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు ఫైనల్ మ్యాచ్లో ఆదిలాబాద్ జట్టుపై 0-7 పరుగుల తేడాతో విజయం సాధించిందని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగమణి సోమవారం తెలిపారు. బాలుర జట్టు ఫైనల్ మ్యాచ్లో ఆదిలాబాద్ జట్టుపై 01-06 పరుగుల తేడాతో విజయం సాధించారన్నారు. బాల బాలికల జట్టు బంగారు పతకాలు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్ బాల్ టోర్నమెంట్ అబ్జర్వర్ మర్కంటి గంగా మోహన్, జట్టుకు కోచ్ మేనేజర్లుగా రాజ్ కుమార్, నరేష్, ఎం సుజాత సంతోష్ లు వ్యవహరించారు.

ఈనెల 16 నుండి 18 వరకు మెదక్ జిల్లా చేగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్-14 వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఇందులో అద్భుత ప్రదర్శన కనబరిచిన విజ్ఞత మగ్గిడి క్రీడాకారిణి జాతీయ స్థాయికి ఎంపిక అయినట్టు పాఠశాల పిడి మధు సోమవారం తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో ఉత్తర ప్రదేశ్ లోని వారణాసిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు తెలిపారు. విద్యార్థిని ఎంపిక పట్ల హెచ్ఎం హరిత , గ్రామ వీడిసి సభ్యులు, పాఠశాల సిబ్బంది ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగమణి హర్షం వ్యక్తం చేశారు.



ఆర్మూర్ : బేస్‌బాల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

1.05కోట్ల విలువైన మత్తు పదార్థాలు దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని పలు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో పట్టుబడిన నిషేధిత గంజాయి, డైజోపాం, అల్ఫాజోలం లాంటి రూ.1.05 కోట్ల విలువైన మత్తు పదార్థాలను ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. నిజామాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమి రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె. మల్లారెడ్డి పర్యవేక్షణలో జక్రాన్‌పల్లి మండలం పడ్కల్ గ్రామంలో మెడికేర్ సర్వీసెస్‌లో, (ఆర్మూర్, బీమ్‌గల్, నిజామాబాద్, మోర్తాడ్‌లో) రూ.1.05 కోట్ల విలువైన 353 కిలోల ఎండు గంజాయి, 1.5 కిలోల డైజో ఫామ్, 2.5 కేజీల ఆల్ఫా జలం దహనం చేశారు. భీంగల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 8 కేసుల్లో 102.5 కేజీ గంజాయి, ఒక కేజీ డైజో ఫామ్, 1/2 కేజీ అల్ఫాజోలం దహనం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఈఎస్ మల్లారెడ్డి, ఎస్‌హెచ్‌వోలు స్టీవేన్ సన్, గుండప్ప, దిలీప్, వేణు మాధవ్ రావులు, సిబ్బంది ఉన్నారు.



పట్టుకున్న మత్తుపదార్థాలు


దహనం చేస్తున్న మత్తుపదార్థాలు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- బహుజన టీచర్స్ అసోసియేషన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ నాయక్ అన్నారు. అలాగే రాబోయే ఎమ్మెల్సీ టీచర్స్ ఎన్నికల్లో సామాజిక స్పృహ, సేవా దృక్పథం, పోరాట పటిమ ఉన్న అభ్యర్థినే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిటిఏ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ నాయక్ మాట్లాడుతూ రానున్న టీచర్స్ గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామాజిక స్పృహ, సేవాదృక్పథం హక్కుల పట్ల పోరాట పటిమ కలిగిన ఎమ్మెల్సీ అభ్యర్థికి బహుజన టీచర్స్ అసోసియేషన్ మద్దతిస్తుందని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి మెరిట్ అభ్యర్థులకు మెరిట్ ద్వారానే ఉద్యోగ నియామకాలు అన్ని శాఖలలో జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని స్పౌజ్ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ బిల్స్, పదోన్నతులను తక్షణమే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బి.సాగర్, వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ పవర్, భీముడు నాయక్, సయ్యద్ యూసుఫ్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్‌నాయక్

కొనుగోలు కేంద్రాలను పెంచి ధాన్యం కొనుగోలు చేయాలి

- తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్


రైతులతో మాట్లాడుతున్న నాయకులు వెంకటేష్

నవతెలంగాణ - మాక్లూర్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచి వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతులు పోసిన ధాన్యం కుప్పలను సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నెల రోజులుగా వడ్లు కోసి మ్యాచర్ వచ్చినా ధాన్యం కట్ అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలు పెంచి కాంటఅయిన వడ్లను రైస్ మిల్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లకే కాకుండా దొడ్డు వడ్లకు కూడా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి పంటల ప్రణాళిక ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం ఆర్మూర్ మండల కార్యదర్శి కొండ గంగాధర్, రైతులు విటల్, మోహన్, వనజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఇషా ఫౌండేషన్ 16వ గ్రామోత్సవం 2024 కప్ జిల్లా స్థాయి వాలీబాల్ యూత్ విభాగం పోటీల్లో విజేతగా నిలిచిన కమ్మర్ పల్లి జట్టు కెప్టెన్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాజ్ కుమార్‌ను ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న అభినందించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్ కుమార్‌ను ఉపాధ్యాయుల బృందం సభ్యులు అభినందించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా డీఎస్ఏ గ్రౌండ్ లో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్ లో 20 జట్లు పాల్గొన్నాయి.ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కమ్మర్ పల్లి యూత్ వాలీబాల్ జట్టు విజేతగా నిలిచి, రూ.9 వేల ప్రైజ్ మనీ గెలుచుకుంది .ఈ నెల 29న హైదరాబాద్‌లో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి ఇషా ఫౌండేషన్ గ్రామోత్సవం కప్ పోటీల్లో జిల్లా తరుపున కమ్మర్‌పల్లి జట్టు పాల్గొన్న నేపథ్యంలో జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన రాజ్ కుమార్‌ను ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో అభినందించారు. విజేతగా నిలిచిన కమ్మర్‌పల్లి వాలీబాల్ టీమ్ సభ్యులను కమ్మర్‌పల్లి వాలీబాల్ సంఘం అధ్యక్షుడు అజారుద్దీన్, ఉపాధ్యక్షుడు రంజిత్, కార్యదర్శి వంశీ, టీమ్ మెంటార్ కిరణ్, సలహాదారు బాల్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ గౌడ్, సరోజన, రమాకుమారి, స్వర్ణలత, పుట్ట రాజేశ్వర్, లక్ష్మీ నరసయ్య, ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం పాల్గొన్నారు.

కోనసముందర్‌లో శిలాఫలకం ధ్వంసం

- నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్ గ్రామంలో గత ప్రభుత్వ హయంలో అభివృద్ధి పనుల కోసం ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గత సంవత్సరం సెప్టెంబర్ 22న అప్పటి రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్న వేముల ప్రశాంత్ రెడ్డి కోన సముందర్, చౌట్‌పల్లి వయా నర్సాపూర్, అమీర్ నగర్ రోడ్డుపై స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి రూ. 60 లక్షలు మంజూరు చేయించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శిలాఫలకం ధ్వంసం అయిన విషయాన్ని సోమవారం తెలుసుకుని స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, సింగిల్ విండో చైర్మన్ సామా బాపురెడ్డి, ఇంద్రాల రాజేందర్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కొందరు కక్షపూరితంగా వ్యవహరిస్తూ శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ధ్వంసమైన శిలాఫలకాన్ని ఎస్ఐ అనిల్ రెడ్డి పరిశీలించారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.


ధ్వంసం చేసిన శిలాఫలకం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మంగళవారం ఉదయం 09 గంటల నుండి 12 గంటల వరకు గల 33/11 కేవీ వినాయకనగర్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి ఏఎస్ ఫీడర్ 11 పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందనిఏడిఈ టౌన్ 3 పి.వీరేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.హనుమాన్ జంక్షన్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, 100 ఫీట్స్ రోడ్డు, ఐబీఎస్ స్కూలు ఏరియా, గూడెం, తుల్జాభవన్, సాయి కృపా నగర్, యెగేశ్వర్ కాలనీ, ఇంద్రాణి స్కూల్, దత్తాత్రేయ ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/నిజామాబాద్‌రూరల్

మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని ఎన్యూమరేటర్లకు ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండలంలోని ఉప్లూర్, కమ్మర్‌పల్లి గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించి సర్వే తీరును సూపర్వైజర్లను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ యజమాని తెలిపిన మేరకు వివరాలు నమోదు చేయాలన్నారు. ఎలాంటి అపోహలకు లోను కాకుండా సమగ్రంగా వివరాలు అందించి ఎన్యూమరేటర్ల కు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు శాంతి కుమార్, నరేందర్, ఉన్నారు.

కమ్మర్‌పల్లి :మండల కేంద్రంలో కొనసాగుతున్న కుల గణన సర్వే జరుగుతున్న తీరును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. సర్వే జరుగుతున్న తీరును ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు అభివృద్ధి సంక్షేమ ఫలాలను అందించేందుకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టిందని సుంకెట రవి తెలిపారు. సర్వే పట్ల ప్రజలెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, ఊట్నూరి ప్రదీప్, పూజారి శేఖర్, అబ్దుల్ రఫీ, అవారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్:సోషల్ ఎకనామిక్ సర్వేనందు ఇప్పటివరకు నిజామాబాద్ మండలంలో 8744 కుటుంబాలు ఐడెంటిపై చేయగా ఇప్పటివరకు 5711 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. కేశపూర్ గ్రామపంచాయతీలో చేపడుతున్న సర్వేను సోమవారం ఎంపీఓ, ఎంపీఓ పరిశీలించినట్టు నిజామాబాద్ రూరల్ తహసీల్దార్ ఆనురోద్ చెప్పారు.


నిజామాబాద్ రూరల్‌లో..

మహిళ సంఘాల ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళ మండలాధ్యక్షురాలు వసంత అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వివిధ అంశాలను చర్చించి, తీర్మానించినట్టు ఆమె తెలిపారు. మహిళకు అందించే రుణ భీమా, ప్రమాద భీమా గురించి ముఖ్యంగా చర్చించినట్లు ఆమె తెలిపారు. సమావేశంలో ఏపీఎం శ్యామ్, సీసీలు సంతోష్, వవీన్, అకౌంటెంట్ సుప్రియ, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండలాధ్యక్షురాలు వసంత

బీఎస్ఎన్ఎల్ టవర్ తొలగించాలి

- ప్రజావాణిలో వినతి

నవతెలంగాణ-ఏర్గట్ల

జనావాసాల మధ్య నుండి బీఎస్ఎన్ఎల్ టవర్ తొలగించాలని ఏర్గట్ల గ్రామానికి చెందిన ఆప్రాంత ప్రజలు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. ఈ సెల్ టవర్ వల్ల పరిసర ప్రాంతంలో నివసిస్తున్న వారందరు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. జనసంచారం లేని చోట, ఊరికి బయట ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న పలువురు

బిజెపి, బీఆర్ఎస్ కలిసే కుట్రలు

- గ్రామం రుణం తీర్చుకుంటా
- వచ్చే నెల నుంచి ఇందిరమ్మ ఇళ్లు
- ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత పది నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టించడానికి బిజెపి, బీఆర్ఎస్ కలిసి కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. సోమవారం ఇందల్ వాయి మండలం లోని నల్లవెల్లి గ్రామం లో 65 లక్షల రూపాయలతో చేపట్టే సహకార సొసైటీ కార్యాలయం, రైతు శిక్షణ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో నల్లవెల్లి గ్రామం అండగా నిలబడి ఆశించిన దానికంటే ఎక్కువ మెజార్టీ ఇచ్చిందని గ్రామానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటూనే రుణం తీర్చుకుంటానని అన్నారు. వచ్చే నెల నుండి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ధాన్యాన్ని ఒక్క కిలో తరుగు లేకుండా కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటికే సన్నవడ్లకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 500 బోనస్ ఖాతాలో వేస్తున్నట్టు తెలిపారు గ్రామస్తుల కోరిక మేరకు చెరువులు నీరు నింపడానికి మాటు కాలువ పనులు చేయించామని, జరిగిందని నల్లవెల్లి నుండి తిరుమల తాండ వరకు రహదారి మంజూరైందని డొంకల్ వరకు నిర్మాణానికి 18 కోట్లు, సంస్థాన్ సిర్నపల్లి, నల్లవెల్లి బ్రిడ్జి , చెక్ డ్యామ్ కు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. సహకార సొసైటీ వద్ద నిర్మిస్తున్న కార్ల భవనం రైతు శిక్షణ కేంద్రానికి డిసీసీబీ బ్యాంకు 35 లక్షలు రుణం, సొసైటీ నీధులు 30 లక్షలతో నిర్మాణం చేపట్టడం జిల్లాలోని మొదటిదని అన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో మహిళ భవన నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. అధికారంలో కొచ్చిన తర్వాత ఇప్పటివరకు 60వేల ఉద్యోగాలను అందజేశామని, ఇంకా గ్రూప్-1 గ్రూప్-3, గ్రూప్-4 పరీక్షలు నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. అంతకు ముందు డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారా చంద్ నాయక్, సహకార సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.అనంతరం పలువురు శాలువాతో, బోకేలతో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కూరి నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, డిసిసిబి డైరెక్టర్ కోరట్పల్లి ఆనంద్, ఏఎంసి డైరెక్టర్ ధండ్ల రాజన్న, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, సీఈవో తేజ గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, డిసిసి డెలిగేట్ తలారి సుధాకర్,కర్స మేహన్, ఆశిష్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్ఐసి గంగాధర్, చింతల కిషన్, లారీ గంగారెడ్డి, క్యాషియర్ రాజన్న, నవీన్ గౌడ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- రూ. లక్ష 80 వేల నగదు, రెండు తులాల బంగారం స్వాధీనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో వారం రోజుల క్రితం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కమ్మర్‌పల్లి బస్టాండ్ లో అనుమానస్పదంగా కనిపించిన నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ ను అదుపులోకి తీసుకొని విచారించారు. మండలంలోని హాస కొత్తూర్ గ్రామంలో వారం రోజుల కింద జరిగిన దొంగతనం, అదేవిధంగా ముప్కాల్ మండల కేంద్రంలో ఒక ఇంట్లో దొంగతనం చేశానని ఒప్పుకున్నట్లు తెలిపారు. దొంగతనం చేసిన బంగారం, డబ్బులను తీసుకొని కారు కొనడానికి జగిత్యాల జిల్లా మెట్ పల్లి వెళ్తున్న నిందితుడు తెలిపాడు. నిందితుడిని అరెస్టు చేసి రూ. లక్ష 80 వేల నగదు, రెండు తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఆర్మూర్ న్యాయస్థానంలో హాజరు పరిచి జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తుకు సహకరించిన నిజామాబాద్ సిసిఎస్ సిబ్బందిని భీంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ అభినందించారు.

ఏర్గట్ల విద్యార్థినికి బాలరత్న పురస్కారం

నవతెలంగాణ-ఏర్గట్ల

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న శ్రీనిధి బాలరత్న పురస్కారానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఈ అవార్డు దక్కుతుందని, కమలాకర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారు నవంబర్ 19 న శ్రీకృష్ణ దేవరాయల తెలుగు భాషా నిలయంలో ప్రముఖుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేస్తారని తెలిపారు. కరాటేలో సాహిత్య రంగంలో చక్కని ప్రతిభ కనబర్చినందుకుగాను విద్యార్థినికి ఈ గౌరవం దక్కిందని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు ప్రవీణ్ శర్మను, శ్రీనిధిని అభినందించారు.



బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేత కమ్మర్‌పల్లి



బహుమతులు అందుకుంటున్న విజేతలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ లో మండలానికి చెందిన యువకులు విజేతగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన పెంట కిషన్, ఉప్లూర్ గ్రామానికి చెందిన ఎలేటి మోహన్ రెడ్డి జంటగా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. 35 సంవత్సరాలు పైబడిన వారి విభాగంలో విజేతలుగా నిలిచారు. ఇదే జంట 40 సంవత్సరాల విభాగంలో కూడా పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. పోటీల అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రధాన కార్యక్రమానికి జిల్లా న్యాయమూర్తి కుంచాల సునీత, మైనార్టీ చైర్మన్ తాహిర్ బీన్ హందాన్ చేతుల మీదుగా పెంట కిషన్, ఏలేటి మోహన్ రెడ్డి బహుమతులు అందుకున్నారు. వారిని మిత్రులు అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని పోటీలో పాల్గొని విజేతలుగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు.

టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానం



రాష్ట్ర నాయకులను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అఖిలభారత ఉద్యోగ సమైక్య ఉపాధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేనీని సన్మానించారు. టీఎన్జీవో కేంద్ర కార్యాలయం నాంపల్లి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. టీఎన్జీవో నూతన జిల్లా అధ్యక్షులుగా ఎన్నికై, పదవి బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా కేంద్ర కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను శాలువా, పూలమాలతో సన్మానించి ధన్యవాదములు తెలియజేశారు. అనంతరం వివిధ శాఖల ఉద్యోగుల సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరగా సానుకూలంగా స్పందించిన రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు జిల్లా పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, టిఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి, టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, కోశాధికారి టి.దినేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు గుడికందుల సంజీవయ్య , జిల్లా సంయుక్త కార్యదర్శులు జాఫర్ హుస్సేన్, అతిక్ అహ్మద్, టిఎన్జీవో అర్బన్ యూనిట్ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ , అర్బన్ యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ అర్బన్ ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ అర్బన్ ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని 17వ డివిజన్ కార్పొరేటర్ మాయావర్ సవిత భర్త రాజు మరణించారు. సోమవారం వారి కుటుంబాన్ని మాజీ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త పరామర్శించారు. అలాగే మాజీ కార్పొరేటర్ బొబ్బిలి మురళి తండ్రి ఇటీవలే మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, దారం సాయిలు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. నగరంలో గల న్యాల్కల్ ప్రాంతంలో పది రోజుల క్రితం వడ్డీ వ్యాపారుల దౌర్జన్యానికి, వికృత చేష్టలకు భయపడి భర్త, కూతురుతో కలిసి బాసర గోదావరి నదిలో దూకి ఆత్మ హత్య చేసుకొని ప్రాణాలను కోల్పోయారు. ఈఘటనలో భార్య అనూరాధ సురక్షితంగా ప్రాణాలతో బయట పడింది. ఆమెతోపాటు వారి కుటుంబ సభ్యులను కుటుంబసభ్యులను పరామర్శించి వారికి కొంత ఆర్థిక సాయం అందించారు. వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. వీరి మరణానికి కారణమైన వారిపై చట్టరిత్య కఠినచర్యలు తీసుకునే విధంగ పోలీసులతో మాట్లాడుతానని వారికి మనో ధైర్యాన్ని కల్పించారు. నగర మేయర్ నీతూ కిరణ్, కసుబ సంపత్, బాల్ దాస్, కాలభైరవ శ్రీను, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి నగర కళ్యాణ మండపాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే..

పద్మశాలి నగర కల్యాణ మండపం ప్రారంభించిన సందర్భంగా కల్యాణ మండపాన్ని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త సోమవారం సందర్శించి సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు కోటి 50 లక్షల నిధులు మంజూరుచేయగా నిర్మించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నగర పద్మశాలీ సంఘం పెద్దలు మాజీ ఎమ్మెల్యే, మేయర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నగర అధ్యక్షులు గుజ్జెటి వెంకట నర్సయ్య, జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు దీకొండ యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్గం హనుమాండ్లు, ఎనగందుల మురళి, ఉపాధ్యక్షులు అవదూత దశరథం, గంట్యాల వెంకట నర్సయ్య, బింగి మోహన్, సత్యపాల్, దాసు, పెంటి దాసు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల19 నూతన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ..ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలు విడుదల చేయాలని, నగదు రహిత వైద్యం అన్ని కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతించాలని, పిఆర్‌సీ 30శాతం ఫిట్మెంట్‌తో అమలు చేయాలని, వెల్నెస్ సెంటర్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లు ను నియమించాలని తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు, డివిజన్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు, కార్యదర్శి ప్రసాద్ రావు, గౌరవ అధ్యక్షులు దత్తాత్రేయరావు, జిల్లా నాయకులు బాబా గౌడ్, లావు వీరయ్య, భోజారావు రాధాకృష్ణ తదితరులు తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

సమగ్ర సర్వేలో తప్పులు లేకుండా చూడాలి

- ఎంపీవో మారుతీ పరిశీలన

నవతెలంగాణ-వర్ని/నాగిరెడ్డిపేట్/రెంజల్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమారేటర్‌లు తప్పులు లేకుండా చూడాలని ఎంపీవో మారుతీ తెలిపారు. సోమవారం మండలంలోని శ్రీనగర్, ఎస్ఎన్ పురం, అంతపూర్ తాండ గ్రామాలలో కొనసాగే సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేను త్వరగా పూర్తి చేయాల్సిన సిబ్బందికి తెలిపారు. తప్పులు లేకుండా ప్రతి కుటుంబంలో వివరాలను నమోదు చేసి అధికారులకు అప్పగించాలని కోరారు.

నాగిరెడ్డిపేట్: మండలంలో సమగ్ర కుటుంబ సర్వే సోమవారం నాటికి 80శాతం పూర్తి అయినట్టు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. మిగతా 20 శాతం త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన అన్నారు. సోమవారం లింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి పలు సలహాలు సూచనలు ఇచ్చారు.

రెంజల్: సమగ్ర కుటుంబ సర్వేను సిబ్బంది వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ ప్రత్యేక అధికారి రఫీ హైమద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బోర్గం, కళ్యాపూర్, కూనేపల్లి గ్రామాలలో సమగ్ర కుటుంబ సర్వేను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి.రాణి, బోర్గం మాజీ ఉపసర్పంచ్ ఫిరోజొద్దీన్, వీవోఏ జె.లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త రాధిక తదితరులు పాల్గొన్నారు.



వర్ని: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో మారుతి



నాగిరెడ్డిపేట్‌లో..



రెంజల్‌లో..

మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారంలో కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం చివరి రోజున దెగ్లూర్ నియోజకవర్గం బిలోలి ప్రచారంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. సోమవారం ప్రచారంలో భాగంగా పాల్గొన్న అభ్యర్థి నివృత్తి కాంబ్లేని ఎమ్మెల్యే గా గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్, దేవరాజ్ గౌడ్, రాజాగౌడ్, మిట్టు ఆనంద్, నంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రంగంపేట వీడీసీ అధ్యక్షులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రంగంపేట గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎన్కంపల్లి మహేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గి రెడ్డి మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బండి పోచయ్య తదితరులు ఉన్నారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

డిసెంబర్ 1న జరగబోయే మాలల సింహ గర్జనను విజయ వంతం చేయాలని నిజామాబాద్ జిల్లా మాల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘం నాయ కులు మాట్లాడుతూ.. రాజ్యాంగ హక్కులు కాలరాస్తూ ఉంటే చూస్తూ ఊరు కోవద్దు మన హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించదం బాబాసాహెబ్ అంబేద్కర్ వారసులుగా రాజ్యాంగ హక్కులు కాపాడుతూనే మాలల ఆత్మగౌరవని కాపాడుకునే ఉద్యమంలో భాగస్వాములు అవుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల సంఘం జేఏసీ చైర్మన్ నిజామాబాద్ గైనిగంగారం, మాల సంఘం ల కామారెడ్డి జేఏసీ చైర్మన్ బంగారు సాయిలు, మాల మహాసభ జిల్లా అధ్యక్షులు కేశ్ పల్లి రవి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సుంకరి మోహన్, మాల సంఘం పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కొట్టల స్నేహిత్ ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఆర్మూర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అండర్-14 ఎంపిక ప్రక్రియలో భాగంగా 7వ తరగతి చదువుతున్న మహాత్మ జ్యోతి బాపూలే కంజర్ విద్యార్థి, రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు కొట్టల స్నేహిత్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్, ఆర్సీఓ సత్యనాథ్ సోమవారం తెలిపారు. అనంతరం కొట్టల స్నేహిత్‌కు వారు అభినందించారు. పోటీలో మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి పేరు ప్రఖ్యాతలు తెచ్చే విధంగా చూడాలని ఆర్సీఓ కోరారు. పిఈటి నవీన్, అధ్యాపక బృందం అభినందించారు.



ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఆర్సీవో, పీఈటీ, తదితరులు